శ్రీమతి బి. సరోజినీదేవిగారు

# వాగ్దానము

★

వెంకయ్యా మేలువేళ అయింది. అబ్బాయి వస్తాడు. కారుతీసుకొని స్టేషన్కి వెళ్ళూ అనిచెప్పి రాజేశ్వరమ్మ యింట్లోకి వెళ్ళిపోయింది. అప్పుడే మెట్లు ఎక్కుతున్న సరళ ఆమాట వింది. రాజేశ్వరమ్మ లోపలకి వెళ్ళిపోగానే వెంకయ్యా స్టేషనికి ఎందుకు? ఎవరు వస్తారు? సుధాకరబాబుగారు వస్తారండి. అంటూ వెంకయ్య కారతీసుకొని స్టేషన్కి వెళ్ళిపోయాడు. సరళ లోపలకి వెళ్ళింది. రాజేశ్వరమ్మ, సరళను చూచి 'రా అమ్మా లోపలికి. మీ అమ్మ కులాసాగవున్నదా?' 'కులాసాగానేవున్నది అత్తయ్యా?' 'మీ అక్క ఏమిచేస్తోంది? ఈ సంవత్సరము పెండ్లిచేస్తారా?' 'నాన్నగారు సంబంధాలు చూస్తున్నారు. మంచి సంబంధము వస్తే చేసేస్తారు.' 'మా సుధాకరనకు ఈ సంవత్సరముతోటి చదువు పూర్తిఅయి పోయింది. వాడికి సంబంధముచూచి పెండ్లిచేస్తాము.' 'ఈరోజు సుధాకరుబాబువస్తారా?' 'అవును. ఇప్పుడు మేలులో వస్తాడు. ఏదో పనిమీద వచ్చినట్లువున్నావు.' 'ఏమీలేదు అత్తయ్యా! ఇంట్లో ఏమీతోచక వచ్చాను. ఇంక వెళతాను' అంటూ సరళ యింటికి వెళ్ళిపోయింది.

కాకినాడ డిప్యూటీకలెక్టరు రామారావుగారి కొడుకు సుధాకరుడు. విశాఖపట్నంలో ఎమ్. బి. బి. యస్. ప్యాసయి వచ్చాడు. సుధాకరుడు చాల అందమయిన ముఖము, నల్లటి నొక్కు, నొక్కుల క్రాపింగు, అందానికి తగ్గ వినయము అన్నీ అతనిలో మూర్తీభవించి యున్నాయి. 'ఏం నాయినా ఇంక నీచదువు పూర్తిఅయినట్లేనా?' 'ఈసంవత్సరముతోటి పూర్తిఅయిందమ్మా.' 'ఇంక నీ పెండ్లి చేసి, నిన్ను, కోడలిని చూచుకొని సంతోషముగావుండడమే నాకు మీ నాన్నగార్కి నాయనా' 'ఇప్పుడు పెండ్లి కేమి తొందర వచ్చిందమ్మా? ఇంక ఇప్పుడేకాదు చదువు పూర్తి అయింది. నాకు గవర్నమెంటు ఉద్యోగము చేయుట ఇష్టములేదు. ప్రాక్టీసు పెట్టాలని వున్నది. అది అంతా పూర్తి అయిన తరువాత చేసుకొంటాలే అమ్మా.' 'అదేమిట్రా అలా అంటావు. మామకూతురు సరోజిని నీకు ఇచ్చుటకు అంతా సిద్ధమయింది. నేను మాటకూడ ఇచ్చాను. అది అయినా ఎఫ్. ఎ. చదువుతోంది.' 'నేను సరోజను చేసుకోనమ్మా.' 'శలవలలో దాన్ని ఇక్కడకు పంపమని వ్రాశాను. అయినాచూచి నీవు చాల రోజులయింది. దాన్ని ఒక్కసారి చూస్తే నీవే చేసుకొంటావు.' వీరిద్దరు మాట్లాడుకొంటూ వున్న సమయంలో సరళ అక్కడకు వచ్చింది. సరళను చూచి రాజేశ్వరమ్మగారు మాటమార్చి 'రా అమ్మా సరళా! నాన్నగారు ఊళ్ళో ఉన్నారా?' 'లేరు అత్తయ్యా. ఈరోజు రాజమండ్రి వెళ్ళారు.' అక్కడ కూర్చున్న సుధాకరుని చూచి సరళ వెనక్కి వెళ్ళిపోయింది. 'రా అమ్మా వాడిని చూచి సిగ్గు ఎందుకు?' సుధాకరుడు సరళయొక్క రూపురేఖలు చూచి ముగ్ధుడయ్యాడు. ఆమె తననిచూచి సిగ్గుపడుతోందని తను గదిలోకి వెళ్ళిపోయాడు. 'మీ అక్క రాధ మాయింటికి వచ్చుట మానివేసిందే.' 'రెండు రోజులనుండి జ్వరముగావుంది. అందుచేత వచ్చుటలేదు. మీరుమాటలలో వున్నారు. సాయంత్రమువస్తాలే అత్తయ్యా' అంటూ సరళ వెళ్ళిపోయింది. సుధాకరుడు బయటకు వచ్చి 'ఎవరు అమ్మా ఆ అమ్మాయి.' 'ఈవూరు హైస్కూలు హెడ్ మాష్టర్ గారమ్మాయి. మనయింటి దగ్గరనే వాళ్ళయిల్లు. రోజు ఒకసారి మన యింటికి వస్తుంది. వంట అయింది భోజనము చేదువు గాని రా నాయినా!'

కాకినాడ హైస్కూలు హెడ్ మాష్టరు సత్యనారాయణగారు. ఆయనకు ఇద్దరే కూతుళ్లు పెద్దపిల్ల రాధ; చిన్నపిల్ల సరళ. రాధ స్కూలు ఫైనలు దాకా చదివింది. ఇంక పెండ్లి చేద్దామన్న ఉద్దేశ్యముతో చదువు

మానిపించేశారు. సరళ స్కూలుఫైనలు చదువుతోంది. రాధకన్న సరళ అందములోను, బుద్ధిలోను, వినయ విధేయతలలోను అన్నిటికి అక్కని మించినది. రాధ అంత ఎక్కువ అందమయినది కాదు. అనూయపరు రాలు. కాని పైకి వెంటనే తేలదు. ఎక్కడనుంచో వస్తున్న చెల్లెలనుచూచి 'ఏమే రోజు పెత్తనాలు ఎక్కువ అవుతున్నాయి. శలవలిచ్చిన దగ్గరనుంచి ఆ రాజేశ్వరమ్మగారి యింట్లోనే వుంటున్నావే?' 'ఏంలేదు అక్కా తోచక వెళ్లాను.' 'ఆమెతో నీకు కబుర్లు ఏమిటే? సరేలే ఈరోజు "మేలా" సినిమా చాలా బాగుంటుంది, మనమిద్దరం వెళదాము.' 'వస్తానక్కయ్యా!' సినిమాకు ఇద్దరు బయలుదేరారు. కాని ఆరోజే విడుదల అవుటచేత స్త్రీలకు ప్రత్యేక స్థలములేదు. సరళ మనస్సు సుధాకరుని చూచినప్పటినుండి అదోక మాదిరిగావుంది. సుధాకరుడు గొప్పవాడు. తనని ఎందుకు పెండ్లిచేసుకొంటాడు. ఈ ఆలోచనలతో అక్కతోటి ఒక్క మాటఅయినా మాట్లాడలేదు. ఆడవాళ్లకు టిక్కట్లులేవని చెప్పగానే రాధకు యింటికివెళ్లను బుద్ధిపుట్టలేదు. మొగాళ్లలోనే వెళ్లి కూర్చున్నారు. ఆట మొదలుపెట్టేరు. సరళ కుర్చీప్రక్క ఇంకెవరో ఒక అతను వచ్చి కూర్చున్నాడు. సరళ అసలే భయస్తురాలు, అతన్ని చూచి బెదిరిపోయింది. 'అక్కా ఈరోజు సినిమాకు వచ్చుటంత బుద్ధితక్కువపని మరియొకటిలేదు.' 'ఏమొచ్చిందే! మొగాళ్లలో ఎంతమంది ఆడవాళ్లు కూర్చొనుటలేదు.' ఇంతట్లోకి యింటర్‌వెల్ అయింది, లైట్లు అన్నీ వెలిగాయి. తన ప్రక్క కూర్చున్న వ్యక్తి ఎవరా అని సరళ ప్రక్కకిచూచింది. ఇంకెవరు? తను ఎవరినిగురించి ఆలోచిస్తున్నదో అతనే; సుధాకరుడు. ఆ సమయానికే అతను ఆమెకేసి చూచాడు, ఇద్దరిచూపులు కలిశాయి. సరళ చాల సిగ్గుపడిపోయింది. అదే సమయములో రాధ అతనికేసి చూచి అతని అందమునకు చాల ముగ్ధురాలయింది. ఆట అయిపోయింది. అందరు యింటికి బయలుదేరారు. 'సరళా నీప్రక్కన కూర్చున్న వ్యక్తి ఎవరోకాని చాల అందమైన పురుషుడు. పెండ్లిచేసుకుంటే అలాంటి వానిని చేసుకోవాలి.' ఆ మాట వినే సరికి సరళహృదయములో ముల్లుగ్రుచ్చుకొన్నట్లు అయింది. 'అక్కా అతను ఎవరోకాదు. రాజేశ్వరమ్మగారి కొడుకు సుధాకరుడు.' ఆ! ఏమిటి, వాళ్ల అబ్బాయా? నీకు అప్పుడే అన్నివివరాలు తెలిశాయె.' కబుర్లుచెప్పుకొంటూ వాళ్లు యిల్లుచేరారు. ఆరాత్రి సరళ, రాధలకు నిద్రపట్టలేదు. ఇద్దరు సుధాకరుని గురించేఆలోచన.

'సరోజ! భోజనానికిలే తల్లీ!' 'బావకూడరానీ అత్తయ్యా!' 'వాడు అప్పుడేరాడు నీవురా!' 'ఎందుకులే ఇద్దరము ఒక్కసారి తింటాము.' అప్పుడే షికారునుంచి సుధాకరుడు వచ్చాడు. రాగానే ఎదురుగుండా వున్న సరోజనినిచూచి ఏమి మాట్లాడించకుండా మేడమీదకు వెళ్లిపోయాడు. 'సరోజ మీబావను భోజనానికి పిలు అమ్మా!' అనగానే సరోజ మేడమీదకు వెళ్లింది. సుధాకరుడు కుర్చీలో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆమె మెల్లగా బావా. అంటూ భుజంమీద చెయ్యివేసింది. అతను తుళ్లిపడి వెనక్కి చూచి 'ఓ! సరోజ నీవా కూర్చో.' 'అదేం బావ నన్ను ఆకలి వేలు పట్టలేదా?' 'ఆ పట్టకేం! భోజనం చేద్దాము. పద' అంటూ అక్కడ ఒక్క క్షణం అయినా కూర్చోకుండా క్రిందకు వచ్చేశాడు. భోజనాలు అయి మేడమీదకువెళ్ళి పడుకొన్నాడు. కాని అతని బుద్ధి ఆలోచనలతో నిండిపోయింది. 'సరోజనా నేను పెండ్లి ఆడుట. ఆ చీర కట్టు, సినిమా ఫ్యాషన్‌గా దువ్వుకొనుట, ముఖమునకు బొట్టులేకుండగా. ఛీ అంతా సినిమా ఫేషను ఎంత చదువుకొన్నా ఇటువంటి పాడు పోకలా? సరళ ఎక్కడ? సరోజ ఎక్కడ? ఏమయినాసరే సరోజను చేసుకోలేను.' ఇంతట్లో ఎవరో తలుపుతీసి వస్తున్నట్లు అలికిడి అయింది. ఎవరా అని లేచిచూచాడు. ఇంక ఎవరు సరోజ! 'ఏం బావ అప్పుడే నిద్దరేనా?' 'అవును. సరోజ నిద్దరవస్తుంది. పడుకోవాలి.' 'అదేమిటిబావ! అలా అంటావు. నీతో సరదాగ కబుర్లుచెప్పుకుంటూ నీ దగ్గరపడుకోవాలని వచ్చాను.' 'నీకేమైన మతిపోయిందా సరోజా; ఈడొచ్చిన వాళ్లము. ఈ అర్ధరాత్రిసమయం ఒక్కచోట పడుకోవచ్చునా?' 'అదేమిటిబావాచదువుకొన్నవాళ్లకు ఇటువంటి పిచ్చులు. మనయిద్దరికి పెండ్లి అవుతుందికదా! ఒకచోటవుంటే తప్పేమిటి?'

—; ♦ :—

(సశేషము)